సాక్షి
మంచిర్యాల

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ఈకేవైసీ చేస్తేనే రేషన్

రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతీ ఒక్క లబ్ధిదారుడి వివరాలను సరిచూసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రతీ లబ్ధిదారు ఈపాస్ యంత్రంలో వేలిముద్రలను వేయాల్సిందే.

IIలో▸



విద్యతోనే సామాజిక న్యాయం

విద్యతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. యూనివర్సిటీ సినిమా ప్రమోషన్ కోసం నస్పూర్‌కు వచ్చారు.

IVలో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.1 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెట్



కేంద్రం వద్ద అభ్యర్థిని తనిఖీ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు 33 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పేపర్–1 పరీక్షకు 7,837 మందికి 6,516 మంది హాజరవగా, 1,321 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పేపర్–2కు 5,745 మందిగాను 5,224 మంది హాజరయ్యారు. 521 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని ఆయా డిపార్ట్‌మెంట్‌లకు చెందిన ఉద్యోగులకు పరీక్ష విధులు కేటాయించారు. 12 మంది రూట్ ఆఫీసర్లు, 33 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 33 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 99 మంది హాల్ సూపరింటెండెంట్లు, 330 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. పలు పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, డిస్ట్రిక్ట్ అబ్జర్వర్ రవికాంత్, డీఈవో యాదయ్య తనిఖీ చేశారు.

మట్టి వినాయకులనే పూజించాలి

మంచిర్యాలఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని డీఈవో యాదయ్య సూచించారు. డీఈవో కార్యాలయంలో నేషనల్ గ్రీన్‌కోర్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ముద్రించిన బంకమట్టి వినాయకుల ప్రాధాన్యత తెలియజేసే కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, చౌదరి, రాజ్‌కుమార్, హేమలత, సూపరింటెండెంట్లు సత్యనారాయణ, నవీన్, ఉపాధ్యాయుడు యోగేశ్వర్ పాల్గొన్నారు.

మోకీలు మార్పిడి విజయవంతం



మోకీలు మార్పిడి చేసిన తారతో వైద్యులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటీవల చేసిన మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతమైనట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి తెలిపారు. దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన తారకు ఇటీవల మోకీలు మార్పిడి చేశామన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుని పూర్తి ఆరోగ్యంగా ఉందని వెల్లడించారు. దీనిని విజయవంతం చేసిన వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సీజ్



అంగన్‌వాడీ కేంద్రాన్ని సీజ్ చేస్తున్న సూపర్‌వైజర్

తాండూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెలోకి వెళ్లడంతో ఐసీడీఎస్ సమ్మె విరమణకు ఒత్తిడి తెచ్చే చర్యలకు దిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాండూర్ మండల పరిధిలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత తెలిపారు.

క్రమబద్ధీకరించాలని వినతి



శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సర్వీసును క్రమబద్ధీకరించేలా చూడాలని టీఎన్జీవోస్ రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరికి శుక్రవారం వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షురాలు టి.భారతిదేవి, కార్యదర్శి రాజన్న, ట్రెజరర్ నగేశ్, సభ్యులు, టీఎన్జీవోస్ మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కంకులు విక్రయించి నిరసన



మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని స్థానిక ఐబీ చౌరస్తాలో మొక్కజొన్న కంకులు విక్రయించి నిరసన తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు షాక్!

- 'కారు' దిగిన 'నల్లాల' దంపతులు
- హస్తం గూటికి మాజీ ఎమ్మెల్యే ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి
- పార్టీలోకి ఆహ్వానించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



నల్లాల దంపతులకు కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ తగిలింది. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. కొంతకాలంగా 'నల్లాల' దంపతులు పార్టీ మార్పుపై ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో రెండు రోజులుగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. పార్టీలో తగు ప్రాధాన్యం కల్పిస్తామనే హామీ మేరకు 'హస్తం' గూటికి చేరారు. హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నల్లాల దంపతులతోపాటు వారి ఇద్దరు కుమారులకు శ్రావణ్, సందీప్, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గం నరేశ్, బింగి శివకిరణ్, ముజాహిద్, ఇందాజ్, అనిల్ ప్రభాకర్ తదితరులకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం నల్లాల ఓదెలు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అందరూ స్థానికుడైన తనను ఎమ్మెల్యేగా కోరుకుంటున్నారని తెలిపారు. స్థానికేతరుడు తమను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకే కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు.

రెండోసారి కాంగ్రెస్‌కే మొగ్గు..

మూడుసార్లు చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న భాగ్యలక్ష్మికి పార్టీలో సముచిత ప్రాధాన్యత ఇవ్వడం లేదని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తొలుత బీజేపీవైపు చూస్తున్నారని ప్రచారం జరిగింది. కానీ చివరకు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపారు. గతేడాది మే 19న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ తన కుమారులతో కలిసి టీఆర్‌ఎస్‌ను వీడారు. ఢిల్లీలో అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆర్నెల్లు తిరగకుండానే అక్టోబర్ 5న తిరిగి 'కారు' పార్టీలో చేరారు. తాజాగా మరోసారి గులాబీ పార్టీని వీడి.. హస్తం గూటికి చేరారు.

ఫలించని బుజ్జగింపులు

'నల్లాల' దంపతులు అసంతృప్తితో ఉండి, పార్టీ మారుతారని తెలిసిన క్షణం నుంచే పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ రంగంలోకి దిగారు. వారిని పలువిధాలుగా బుజ్జగించారు. అయితే అవేవి ఫలించలేదు. గతంలో పార్టీ మారినప్పుడు వారికి ఇచ్చిన హామీలు నేరవేర్చకపోవడం, రాజకీయంగా ఇబ్బందిగా మారడంతో మరోసారి పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. పార్టీ మారకుండా ఉండేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. నల్లాల లెక్క చేయకుండా 'కారు' దిగారు.

చెన్నూరు నుంచే పోటీ?

కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఇస్తే వచ్చే ఎన్నికల్లో చెన్నూరు నుంచే నల్లాల ఓదెలు పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రధాన ప్రత్యర్థిగా ఉండడంతో ఆయన్ను ఓడించేందుకు, సానుభూతిని వాడుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లా నాయకత్వం, చెన్నూరు నుంచి టికెట్ ఆశిస్తున్నవారంతా ఓదెలుకు మద్దతు ఇస్తారో లేదో తేలాల్సి ఉంది. గతంలో కాంగ్రెస్ జిల్లా నాయకత్వం నుంచి ఆశించిన మేర మద్దతు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు కొత్త, పాత కలయిక ఎలా ఉంటుందనే ఆసక్తి నెలకొంది.

అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్!

- కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి



మంత్రికి స్వాగతం పలుకుతున్న పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని.. దీనికి సీఎం కేసీఆర్ కృషి, పట్టుదలే కారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం వెళ్తున్న ఆయన మంచిర్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాసేపు ఆగారు. మంత్రికి మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, కౌన్సిలర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడాలేని విధంగా పేదలందరికీ వైద్యం అందించేందుకు జిల్లాకో మెడికల్ కళాశాలను కేసీఆర్ ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నారన్నారు. తెలంగాణ రాకముందు రెండు మూడు మెడికల్ కళాశాలలు ఉండేవని, ఇప్పుడు 29 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రారంభించుకున్నామని తెలిపారు. దీంతోపాటు బస్తీ దవాఖానాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇప్పుడు అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపే చూస్తున్నాయని తెలిపారు. విద్య, వైద్యానికి తెలంగాణ హబ్‌గా మారిందని పేర్కొన్నారు. ఐటీలో హైదరాబాద్, బెంగళూర్‌ను దాటేసిందన్నారు. 9 లక్షల మంది హైదరాబాద్‌లోని ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. దేశమంతా తెలంగాణ మోడల్ కావాలని కోరుకుంటున్నారని వివరించారు. కేసీఆర్ ప్రధాని అయితే దేశం కూడా ప్రపంచంలో నంబర్ వన్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో 25 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కార్మికులు కోరారు. తమను పర్మినెంట్ చేయాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్ వర్తింపజేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని మంత్రికి విన్నవించారు.

'ఫుడ్ ప్రాసెసింగ్' ప్లాట్ల విక్రయం

- పరిశ్రమల ఏర్పాటుకు 37 దరఖాస్తులు
- పది దరఖాస్తులకు ఆమోదం?
- మిగతా వాటికి దశల వారీగా..



ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



లేఅవుట్ మ్యాప్

బెల్లంపల్లి: పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రూ.1,500 కోట్ల అంచనాతో బెల్లంపల్లిలో ఏర్పాటు చేస్తున్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ప్లాట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ప్రధానంగా రైస్ మిల్లులు, బియ్యం ఉత్పత్తుల అనుబంధ పరిశ్రమలతోపాటు పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, పాలు, కోళ్లు, పప్పు ధాన్యాలు, డెయిరీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఏడాది క్రితమే రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్ ఐఐసీ)కి ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 37 మంది దరఖాస్తులు చేసుకోగా వీటిలో అర్హత కలిగిన ఔత్సాహికులకు అవకాశం కల్పించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం 10 దరఖాస్తులను ప్రాథమికంగా ఆమోదించినట్లు సమాచారం. మిగతా దరఖాస్తులకు దశలవారీగా అనుమతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

అర్జీదారులకే విక్రయం..

స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు ప్రస్తుతం ప్లాట్లు విక్రయించే ప్రక్రియ చేపట్టారు. మొత్తం 68 ప్లాట్లను ఇందులో ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారుల ఇష్ట ప్రకారంగా 2 ఎకరాలు , 5 ఎకరాలు, 10 ,15 ఎకరాల చొప్పున ప్లాట్లు ఏర్పాటు చేశారు. అవసరమైతే 2 ఎకరాల కన్నా తక్కువ ప్లాట్లు కూడా విక్రయించనున్నట్లు తెలిసింది. ప్రస్తుత ప్రతిపాదిత ప్లాట్లలో ఇప్పటి వరకు 6 ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం. మరో నాలుగు ప్లాట్లు త్వరగా విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్లాట్ల విక్రయాల తర్వాతే..

ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో వ్యవసాయ ఇతర అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదిత భూమిని లేఅవుట్ చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుగుణంగా లేవుట్ అవుట్ ప్రక్రియను పూర్తిచేయగా ఔత్సాహికులు చేసుకున్న దరఖాస్తులకు అప్రూవల్ రావల్సి ఉంది.అప్రూవల్ వచ్చాక తదరు ఔత్సాహికులు ప్లాట్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి దరఖాస్తుదారుడు ప్లాట్‌ను కొనుగోలు చేసి ఆ తర్వాత ఎంపిక చేసిన పరిశ్రమను స్థాపించాల్సి ఉంటుంది.

ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ స్వరూపం..

ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్ అంచనా వ్యయం	రూ.1,500 కోట్లు
రోడ్లు ఇతర సౌకర్యాల కోసం చేసిన ఖర్చు	రూ.30 కోట్లు
ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్ విస్తీర్ణం	355.03 ఎకరాలు
ప్లాట్‌ల అలాటెడ్ ఏరియా	228.44 ఎకరాలు
ప్లాట్ల సంఖ్య 68	

మౌలిక సౌకర్యాలు..

బెల్లంపల్లి మండలం కన్నాల, బుధాకలాన్ గ్రామాల పరిధిలో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలో ఉన్న 355.03 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. గత మే 8న రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బెల్లంపల్లిలో పర్యటించి స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌కు శంకుస్థాపన చేశారు. మంత్రి రాకకు ఏడాది ముందు నుంచే మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టారు. రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో 12 కిలో మీటర్ల అంతర్గత రహదారులు నిర్మించారు. 15 కల్వర్టులు కట్టారు. మురికినీటి కాలువలు నిర్మించారు. విద్యుత్ సౌకర్యం కోసం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్ పనులు పూర్తి చేశారు.

ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నాయి

ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్‌లో ప్రస్తుతం ప్లాట్ల విక్రయాల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఆరు ప్లాట్ల అమ్మకాలు పూర్తయ్యాయి. మిగతా ప్లాట్ల అమ్మకాలు కూడా త్వరగా పూర్తిచేస్తాం. మరో నాలుగు నెలల్లో మిగత దరఖాస్తుదారులకు కూడా ప్లాట్లు విక్రయించి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటాం. – **మహేశ్, డెప్యూటీ జోనల్ మేనేజర్, టీఎస్ ఐఐసీ, కరీంనగర్**

వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- వ్యాధులు ప్రబలే ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ చేయొద్దు
- కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణపై సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.సంతోష్ సూచించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు సూపర్‌వైజర్లు, మండలపరిషత్ అభివృద్ధి అధికారులతో కీటకజనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ నియంత్రణపై డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కీటకజనిత వ్యాధుల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది డెంగీ నియంత్రణపై దృష్టిపెట్టాలన్నారు. ప్రతీ మున్సిపల్ పరిధిలో వైద్యాధికారులు సమీక్ష నిర్వహించుకుని ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో అనుసంధానం చేయాలని తెలిపారు, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాలలో వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ప్రతీ ఆదివారం ఉదయం 10.10 గంటలకు ప్రతీ ఇంట్లో డ్రైడే పాటించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రతీరోజు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. హాజీపూర్, మందమర్రి, మంచిర్యాల, జైపూర్, కాసిపేట, తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి ఆయా గ్రామాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ చేయొద్దన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రానికి రక్త నమూనా పంపించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఎంపీలు డెంగీ పేరుతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు కీటకజనిత వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. విధులను నిర్లక్ష్యం, అలసత్వం చేసేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యులు సునీత, నీరజ, ఫయాజ్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్యులు నూతన్ అరవింద్, భీష్మ, రవి, మాస్ మీడియ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంవైపు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న చైర్మన్ వినయ్‌ప్రకాశ్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతు ఉత్పత్తి సంస్థలోని సభ్యులు రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయం చేయాలని సంస్థ చైర్మన్ వినయ్‌ప్రకాశ్‌రావు సూచించారు. హాజీపూర్‌లోని రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీసీ) కార్యాలయంలో సంస్థ 3వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా సొసైటీలకు ఇచ్చిన విధంగా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఫర్టిలైజర్, రవాణా సౌకర్యం ఉచితంగా కల్పించాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని ఎఫ్‌పీసీలు అన్నీ కలిపి ఫెడరేషన్‌గా ఏర్పాటు చేసుకునేందుకు తీర్మానం చేశామన్నారు. హాజీపూర్ ఎఫ్‌పీసీకి ఒక గోదాము కూడా ఏర్పాటు చేసుకునేలా తీర్మానం చేశారు. ఈ మేరకు రైతుల షేర్ అమౌంట్ పెంచాలని చేసిన తీర్మానం మేరకు త్వరలోనే ఆచరణలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ భారతి అధ్యక్షుడు రాజిరెడ్డి, ఆహార ఉత్పత్తి సంస్థ గౌరవ సలహాదారు గోనె శ్యాంసుందర్‌రావు, డైరెక్టర్లు పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, బొడ్డు శ్రీనివాస్, పనాస ధర్మరాజు, స్థానికులు బొడ్డు భూమయ్య, జూపాక ధర్మయ్య, మహేందర్, రమేశ్, ఎఫ్‌పీసీ రైతులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి



మొక్కలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కోటపల్లి: ఎస్సీ సబ్‌ప్లాన్ పథకంలో భాగంగా పంపిణీ చేసిన పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని క్రైడా శాస్త్రవేత్త కేవీ.ప్రసాద్ అన్నారు. కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఐదు రకాల పండ్ల మొక్కలను కొండంపేట గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకంలో క్రైడా ఆధ్వర్యంలో మామిడి, ఉసిరిక, మునగ, బొప్పాయి మొక్కలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్, సిబ్బంది సంపత్ పాల్గొన్నారు.

వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల మున్సిపల్ పరిధిలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్, దొరగారిపల్లె ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలి పారు. అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, తహసీల్దార్ భోజన్నతో కలిసి స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచిర్యాల మున్సిపల్ పరిధిలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిన్నపిల్లలు, వయోవృద్ధుల ఉల్లాసం కోసం మున్సిపాలిటీల్లో పార్కుల ఏర్పాటులో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీలోని రాముని చెరువు, రామ్‌నగర్ ప్రాంతాలలో చేపట్టిన పార్కుల అభివృద్ధి పనులు పరిశీలించారు. పనుల నిర్వహణపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని సూంచిచారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: ఈనెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, అక్టోబర్ 2వ తేదీన మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకులో శుక్రవారం మాట్లాడారు. రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయి, తలసేమియా, సికిల్‌సెల్ పిల్లలు, ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తహీనతతో వచ్చే గర్భిణులు, ఆపదలో రక్తం కావాల్సిన వారు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యాసంస్థలు, జిల్లా ప్రభుత్వ శాఖలు, రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు.

విలీనానికి ముందే సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి ముందే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంచిర్యాల డిపో ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2017, 2021 పెండింగ్ పేస్కేల్ అమలు చేయాలన్నారు. పీఆర్సీ – 2013 ఏరియర్స్ బాండ్స్‌ను ఇప్పటివరకు వడ్డీతో చెల్లించాలన్నారు. 2023 జనవరి డీఏను అమలు చేయాలని కోరారు. సీసీఎస్‌కు చెల్లించాల్సిన డబ్బులు వడ్డీతోసహా చెల్లించాలన్నారు. రిటైర్డు కార్మికులకు బకాయి డబ్బులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు గోలి శంకర్, బొట్టు లక్ష్మణ్, సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కారుణ్య నియామకం కోసం ఏరియా పరిధిలోని ముగ్గురు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా ఏరియా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. హాజరైన అభ్యర్థులు, కుటుంబ సభ్యులను ఎస్‌వోటూజీఎం నరేందర్, డీవైపీఎం తిరుపతి పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల వివరాల సేకరణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. డీజీఎం ఈఅండ్ఎం నాగభూషణ, సంక్షేమ అధి కారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కేంద్రం పరిశీలన

కాసిపేట: మండలంలోని కేకే ఓసీ విస్తరణలో భాగంగా దుబ్బగూడెం గ్రామస్తులకు కేటాయించిన పునరావాస కేంద్రం స్థలాన్ని శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం మనోహర్ పరిశీలించారు. పునరావాస స్థలంలో జరుగుతున్న పనులను సమీక్షించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయడంతో పాటు బాధితులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. ఏజీఎం ఈఅండ్ఎం నాగరాజు, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, డీజీఎం వర్క్‌షాప్ నరసింహారాజు, ఎస్టేట్ అధికారి కుమారస్వామి ఉన్నారు.

పరిహారం చెక్కుల పంపిణీ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్ పరిధిలోని చీలపెల్లి బీట్‌లో గతంలో పులిదాడిలో చనిపోయిన పశువుల యజమానులకు శుక్రవారం సిర్పూర్(టి) అటవీశాఖ అధికారులు, చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య నష్టపరిహారం చెక్కులు అందజేశారు. చీలపల్లి గ్రామానికి చెందిన గుర్నులే గణపతికి రూ.25వేలు, ఎలుకుచి వెంకటేష్‌కు రూ.18వేలు, ములకల శ్రీనివాస్ రూ.15వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో మోమన్, ఎఫ్‌బీవో షేక్ షాహిద్ పాల్గొన్నారు.

ఏసీబీకి తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: ఏసీబీకీ తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ శుక్రవారం నాంపల్లిలోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి దుర్గ ప్రసాద్ తీర్పునిచ్చారు. నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన రుకుం తిరుమల్ ఓ అధికారిపై నేరారోపన చేస్తూ ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. తిరుమల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు నాంపల్లి ఏసీబీ కోర్టులో విచారణ చేపట్టగా తిరుమల్ తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలింది. దీంతో అతడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీ

మంచిర్యాలటౌన్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మిగిలిపోయిన స్వల్ప ఖాళీలను నింపేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, బ్యాక్‌లాగ్ ఖాళీలైన 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన వాటికి ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం గర్ల్స్ లక్సెట్టిపేట్‌లో బాలురు, బాలికలకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ చేస్తేనే రేషన్

- కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతిఒక్కరూ వేలిముద్ర వేయాల్సిందే
- మృతుల ఏరివేత కోసమే..
- ఎక్కడ ఉన్నా ఈకేవైసీ చేసుకోవచ్చు
- కొత్తకార్డులు, పేర్ల నమోదు ఇక లేనట్లే



ఈకేవైసీ చేస్తున్న లబ్ధిదాడురు



వేలిముద్ర వేసి రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

మంచిర్యాలటౌన్/రెబ్బెన(ఆసిఫాబాద్): రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడి వివరాలను సరిచూసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత నెలలోనే ప్రారంభించాల్సి ఉన్నా ఈ నెలలోనే ఈ విధానాన్ని రేషన్ దుకాణాల్లో ప్రారంభించారు. ఇందుకు రేషన్‌కార్డుల్లోని లబ్ధిదారులందరూ రేషన్‌షాపుకు వెళ్లి, తప్పనిసరిగా ఈకేవైసీ కోసం ఈపాస్ యంత్రంలో వేలిముద్రలను వేయాల్సిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా నుంచి రేషన్‌కార్డుదారులకు ప్రతి నెలా ఒక్కో లబ్ధిదారుడికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యుల పేరిటే నేటికి బియ్యం పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుదారుల్లోని కుటుంబ సభ్యుల్లో కొందరు మృతి చెందిన వారు, పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిన వారు, కుమారులు పెళ్లి చేసుకుని ఉద్యోగం, ఇతరాత్ర ఉపాధి పేరిట ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి పేర్లు రేషన్ కార్డుల్లో అలాగే కొనసాగుతున్నాయి. ఈకేవైసీ చేయడంతో ఆయా పేర్లను తొలగించేందుకు అవకాశం ఉంది. అందులో భాగంగానే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈకేవైసీని ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభించగా మూడు నెలల సమయాన్ని ఇచ్చింది. ఈకేవైసీ చేసుకోని వారికి రేషన్ సరఫరాను నిలిపివేయనున్నారు.

పేర్లు ఉన్నవారు కేవైసీ చేయాల్సిందే

రేషన్‌కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులంతా రేషన్ దుకాణానికి ఈకేవైసీ కోసం వెళ్లి వేలిముద్రలను వేయాలి. వేలిముద్ర వేయగానే రేషన్‌కార్డు నంబర్‌తో పాటు, సభ్యుల ఆధార్ నంబర్ చూపిస్తుంది. వీటిని సరిచూసుకున్న తరువాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల ఈకేవైసీ పూర్తవుతుంది. ఒకవేళ ఈపాస్ యంత్రంలో ఎరుపురంగు వెలిగితే సదరు వినియోగదారుడి రేషన్‌కార్డు, ఆధార్ సరిపోల్చలేమంటూ రిజెక్ట్ సూచిస్తుంది. ఈ ప్రక్రియలో గైర్హాజరైన యూనిట్ల వివరాలు ఈ–పాస్ యంత్రంలో నమోదవుతాయి. ఆ తరువాత ఆయా యూనిట్లను తొలగిస్తారు.

'రేషన్'కు ఈకేవైసీ తప్పనిసరి

- అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని ప్రతీ రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవీసీ చేయించుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్‌కార్డు లబ్ధిదారులందరూ తమ వివరాలతో చౌకధరల దుకాణాల వెళ్లి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. రేషన్‌కార్డులోని ప్రతీ లబ్ధిదారుడి వేలిముద్రలు, వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు.

మంచిర్యాల జిల్లాలోని రేషన్‌కార్డులు, లబ్ధిదారులు

మొత్తం రేషన్ దుకాణాలు	423
మొత్తం కార్డుదారులు	2,19,421
ఆహార భద్రత కార్డులు	203771
అంత్యోదయ కార్డులు	15490
అన్నపూర్ణ కార్డులు	160
లబ్ధిదారులు(యూనిట్లు)	6,40,989

ఆసిఫాబాద్ జిల్లా సమాచారం

మొత్తం రేషన్ కార్డులు	139891
మొత్తం యూనిట్లు	461550
ఆహార భద్రత కార్డులు	126805
అంత్యోదయ కార్డులు	13066
అన్నపూర్ణ	20

ఈకేవైసీ తప్పనిసరి



రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాల్సిందే. ఇందుకు వారి సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. ఈకేవైసీతో కార్డుదారుల్లో ఎంత మంది ఉన్నారు. ఎంత మందికి రేషన్ సరఫరా చేస్తున్నారనే వివరాలు ఖచ్చితత్వంగా ఉంటాయి. – ప్రేమ్‌కుమార్, మంచిర్యాల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

భారాన్ని తగ్గించుకునేందుకే కేవైసీ



ప్రభుత్వాలు రేషన్ బియ్యంపై భారాన్ని తగ్గించుకునేందుకే కేవైసీని తీసుకువచ్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఒక్క కొత్త రేషన్‌కార్డును కూడా ప్రభుత్వం మంజూరు చేయకపోగా కార్డులో ఉన్న పేర్ల ను కూడా తొలగించేందుకు కుట్రలు చేస్తోంది. ప్ర భుత్వం వెంటనే కొత్త కార్డులను మంజూరు చేయాలి. – బోగే ఉపేందర్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

30లోగా కేవైసీ చేయించుకోవాలి

జిల్లాలో రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈనెల 30లోగా కేవైసీ చేయించుకోవాలి. కుటుంబ యజమానితో పాటు కార్డులో పేరున్న వ్యక్తులు ఈపాస్ యంత్రంలో వేలిముద్ర వేసి కేవైసీని పూర్తి చేసుకుంటేనే వచ్చే నెల నుంచి ప్రభుత్వం అందించే రాయితీ బియ్యం ఇస్తారు. – తారామణి, ఆసిఫాబాద్ జిల్లా పౌర సరాఫరాల అధికారి

హత్యాయత్నం కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలోని ముదిరాజ్ కాలనీలో గల లక్షీదేవర వాడకు చెందిన బొజ్జ జ్యోతిని కత్తితో వీపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన అట్టెం విజయ్ అనే వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానాను మంచిర్యాల ప్రిన్సిపాల్ సీనియర్ జడ్జి ఉదయ్‌కుమార్ విధించినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. బావమర్ది అయిన అట్టెం విజయ్ అనే వ్యక్తి బొజ్జ అంజయ్య ఇంటి ఎదురుగా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. విజయ్ రోజు తాగి వచ్చి గొడవలు పెట్టడంతో ఇంటి యాజమాని ఇంటిని ఖాళీ చేయించాడు. బావఅంజయ్య, అక్క జ్యోతి వలనే ఇంటిని ఖాళీ చేయించాడని పగ పెంచుకున్నాడు. 12 మే 2017న రాత్రి అక్క, బావలను చంపాలని విజయ్ కత్తితో దాడి చేశాడు. దీంతో జ్యోతికి తీవ్రగాయం కాగా మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. జ్యోతి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు వెలువడింది.

మహమ్మదబాద్ గ్రామవాసికి ఐదేళ్లు..

జన్నారం: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ మంచిర్యాల న్యాయమూర్తి అర్పిత మారం రెడ్డి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. జన్నారం మండలం మహమ్మదబాద్ గ్రామానికి చెందిన ఎంబడి రాయమల్లు, అదే గ్రామానికి చెందిన ఓ మహిళను లైగికంగా వేధించడంతో పాటు 2020 జూన్1న ఉపాధి హామీ పనులకు వెళ్లిన సదరు మహిళను కత్తితో పొడిచి గాయపరిచినట్లు మహిళ భర్త వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై వినోద్ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశాడు. ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టగా వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం పైవిధంగా తీర్పునిచ్చారు. అదే విధంగా నేరస్తుడిపై రౌడీషీట్ నమోదు చేయడం జరిగిందని, గతంలో కూడా నిందితున్ని పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



తరుణ్ (ఫైల్)

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గోవింద్‌పూర్ కాలనీకి చెందిన తోర్ తరుణ్(23) గురువారం రాత్రి మద్యం మైకంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిర్పూర్ (టి) ఎస్సై డికొండ రమేష్, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తోర్ తరుణ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం అతిగా మద్యం తాగి తండ్రి సుభాష్‌తో గొడవపడి దాడి చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మద్యం మత్తులో ఇంటి వెనకాలోని పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి తోర్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రూ.75వేల నగదు, బైక్ స్వాధీనం

నస్పూర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నస్పూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి వెళ్లే దారిలోని ఓ హార్డ్‌వేర్ షాప్‌లో ఈ నెల 12న ఎండీ ఆసిఫ్ బేగ్, ముజీద్ అలీ నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటి నిర్మాణానికి సామాన్లు కావాలని వచ్చారు. షాపు యజమాని ఓ వ్యక్తికి షాపు వెనకాలకు వెళ్లి సామాన్లు చూపిస్తుండగా మరో వ్యక్తి షాపులోనే ఉన్నారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. యజమాని కౌంటర్‌లో చూడగా రూ.1.50 లక్షలు కనిపించలేదు. దీంతో అతడు 100కి డయల్ చేయగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. షాపు యజమాని బ్రహ్మచారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీఎస్ పోలీసుల సహకారంతో నిందితులను శుక్రవారం పట్టణంలోని తోళ్లవాగు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. నిందితులపై 2007 నుంచి ఆర్మూర్, నిజామాబాద్, బిచ్కుంద, ఎల్లారెడ్డి, సిద్దిపేట పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదయ్యాయి. వారి నుంచి రూ.75వేలు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దేవ య్య, సీసీసీ నస్పూర్ ఎస్సై సంతోష్, కానిస్టేబుల్ సతీష్‌లను డీసీపీ రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతి రెడ్డి అభినందించారు.

ఘనంగా బడగ వేడుకలు



పూజలకు వెళ్తున్న నేతకాని కులాస్తులు

దండేపల్లి: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు బడుగ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య మరుసటి రోజున ఆదివాసీ గిరిజనులు బొడుగ వేడుకలను ఆనవాయితీగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

కాసిపేట: మండలంలో పొలాల అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం దుబ్బగూడెం, కోమటిచేను, కాసిపేట గ్రామాల్లో బడగను నేతకాని కులస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు వేడుకల్లో పాల్గొన్నారు. సంబురాల్లో భాగంగా కట్టుగా నృత్యాలు చేశారు.

చెరువులో నిమజ్జనం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ పంచాయతీలోని కొమ్ముగూడెం గ్రామంలో పొలాల అమావాస్య పండుగలో భాగంగా బడగను ఘనంగా జరుపుకున్నారు. నేతకాని కులస్తులు కొత్త బట్టలు ధరించి మట్టితో తయారు చేసిన ఎద్దుల ప్రతిమలను చెరువులో నిమజ్జనం చేశారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

బెల్లంపల్లి: భార్యతో గొడవ తాళలేక భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం ... రాజస్థాన్ రాష్ట్రంలోని బార్మర్ జిల్లా సంప గ్రామానికి చెందిన బాటి జోగ్‌సింగ్(35) తొమ్మిది నెలల క్రితం బెల్లంపల్లికి వలస వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ ఫ్లైవుడ్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం జోగ్‌సింగ్ ఇంటికి వెళ్లాడు. భార్యతో తరుచుగా గొడవలు జరుగుతున్నాయని, తాను చనిపోతున్నట్లు బెంగుళూరులోని వరుసకు సోదరుడైన తనూసింగ్‌కు ఫోన్‌లో చెప్పాడు. దీంతో అతడు షాపు యజమానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. షాపు యజమాని జోగ్‌సింగ్ అద్దెఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని వృద్ధుడు..

మందమర్రిరూరల్: అనారోగ్యంతో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... పట్టణంలోని రెండోజోన్‌లోని కటికె దుకాణాల ఏరియాకు చెందిన బీరం నర్సయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బెజ్జూర్: మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు (45) చేపల వేటకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం మండలంలోని అర్కగూడ గ్రామ సమీపంలోని వాగులో శవమై తేలినట్లు కుటుంబీకులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో కోడిపందెల ఆటకు వెళ్తున్నట్లుగా అనుమించి ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం దండేపల్లి, హాజీపూర్ మండలాలకు చెందిన అనుమానితుల వద్ద నాలుగు పందెం కోళ్లు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు.

డీజే నిర్వాహకుల బైండోవర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో ప్రజల శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన ఆరుగురిని శుక్రవారం పోలీసులు బైండోవర్ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం ...డీజే సౌండ్‌తో ప్రజాశాంతికి భంగం కలిగించిన డీజే నిర్వాహకులు ఎండీ సర్వర్, ఎండి.హైమత్ పాషా, బి.అనిల్, నగరం శ్రీనివాస్, ఎండి.గౌస్, గన్నారం మల్లేష్‌లను మండల తహసీల్దార్ సుధాకర్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ ఆరు నెలల కాల వ్యవధిలో డీజే పొల్యూషన్ నేరానికి పాల్పడితే రూ.2లక్షల జరిమానా లేదా జైలు శిక్ష ఉంటుందని తహసీల్దార్ హెచ్చరించి సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

గుడుంబా పట్టివేత

దండేపల్లి: మండలంలోని మేదరిపేట వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్ తెలిపారు. లింగాపూర్‌కు చెందిన ప్రశాంత్ ఆటోలో గుడుంబాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌కు చెందిన మెరుగు గురువయ్య గొర్రెల మందపై గురువారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో తొమ్మిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారుగా రూ.60వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని టోంకిని గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై డికొండ రమేశ్ శుక్రవారం తెలిపారు. వద్ద నుంచి రూ.20100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సృజనాత్మకత కలిగిన ప్రతి ఒక్కరూ ఇంజినీరే



చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన: సృజనాత్మకత కలిగిన ప్రతి ఒక్కరూ ఒక ఇంజినీరే అని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం 56వ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. సృజనాత్మకతో పని చేసే ప్రతీ ఇంజినీరు దేశానికి ఎంతో అవసరమన్నారు. సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ నిర్విరామంగా కొనసాగేందుకు అన్ని విభాగాలు ఎంతో అవసరమని, అందులో ఇంజినీరింగ్ విభాగం ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో సత్యనారాయణ, గోలేటి ఓసీ పీవో ఉమాకాంత్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్, డీజీఎం ఎఫ్అండ్‌ఏ రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

15సీఎస్ఆర్76–ఎస్టీపీపీలో ఇంజనీర్ డే వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో శుక్రవారం జాతీయ ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీపీ అడ్మిన్ భవన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు డైరెక్టర్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు ఫిజేలాల్, ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, కెవీ.రావు, శ్రీనివాస్, నానాయణరావు, సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

నస్పూర్‌లో..

నస్పూర్: సీసీసీ సింగరేణి గెస్ట్ హౌజ్‌లో ఇంజినీరింగ్ డేను జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు హాజరయ్యారు. కార్యక్రమంలో జీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు, జీఎం వర్క్‌షాప్స్ ప్రిథ్వారాల్, జీఎం ఎస్‌టీపీపీ భాసివిరెడ్డి, ఎస్ఓటూ జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ ప్రాజెక్టు అధికారులు శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి ఆస్తులపై సీబీఐ విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న రమేశ్‌యాదవ్

చెన్నూర్: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు అతడి కుటుంబ సభ్యుల ఆస్తులపై సీబీఐతో విచారణ జరిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక తాపీ మేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యపేట నియోజకవర్గంలో సైకిళ్లపై నీళ్ల డబ్బాలు అమ్ముకున్న సామన్య వ్యక్తి మంత్రి అయిన తరువాత రూ.వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. యాదవ కులానికి చెందిన జానయ్య యాదవ్ రాజకీయంగా ఎదుగుతుంటే తప్పుడు కేసులు పెట్టించి రౌడీగా ముద్రిస్తున్నాడని ఆరోపించారు. బీసీ సామాజిక వర్గ ప్రజలంటే జగదీశ్‌రెడ్డి ఓర్వలేకపోతున్నారని తెలిపారు. సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్ర తిరుపతియాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంత్రి మల్లేశ్, మహిళ అధ్యక్షురాలు ఆరిగెల పద్మయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికిరణ్, నాయకులు రాజన్న, బాలేశ్, కిట్టేశ్, రమేశ్, మధూకర్, తిరుపతి, కుమార్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.


బీపీఏలో టార్గెట్ కమిటీ పర్యటన



మాట్లాడుతున్న టార్గెట్ కమిటీ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించేందుకు శుక్రవారం టార్గెట్ కమిటీ సభ్యులు పర్యటించారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తి సాగించాలని సూచించారు. నూతన ఓసీపీ ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.4లక్షల టన్నులు, అదే తరహాలో కైరిగూడ ఓసీపీ ద్వారా రూ.37.5 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సమావేశంలో టార్గెట్ కమిటీ సభ్యులు జీఎం సీపీఅండ్‌పీ జక్కం రమేష్, జీఎం క్వాలిటీ అల్లి రాజేశ్వర్, జీఎం సర్వే రవి, ఏజీఎం ఈఅండ్ఎం బొజ్జ రవి, అధికారలు వెంకటేశ్వర్‌రావు, వినోద్‌కుమార్, ఏరియా ఎస్‌వోటూజీఎం నరేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవోలు ఉమాకాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయాలపాలైన ఐద మల్లేష్, నికాడె ఫణిందర్

చింతలమానెపల్లి: మండలంలోని రవింద్రనగర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఐద మల్లేష్ కౌటాల నుంచి ద్విచక్రవాహనంపై రవింద్రనగర్ వైపు వస్తున్నాడు. కౌటాల మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన నికాడె ఫణిందర్ రవింద్రనగర్ నుంచి కౌటాల వైపు బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే సమయంలో రవింద్రనగర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న చింతలమానెపల్లి ఎస్సై వెంకటేష్‌కు రోడ్డు ప్రమాదం సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని పోలీసు వాహనంలో కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని 108 వాహనంలో కాగజ్‌నగర్‌కు తరలించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రం తోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్టర్న్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూఫ్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

విద్యతోనే సామాజిక న్యాయం

- సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి
- యూనివర్సిటీ సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు రాక


నారాయణమూర్తిని సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: విద్యతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్. నారాయణమూర్తి అన్నారు. మంచిర్యాల జిల్లా సింగరేణి శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం నారాయణమూర్తిని సన్మానించారు. అనంతరం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన యూనివర్సిటీ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో నారాయణమూర్తి మాట్లాడారు. తాను నటించి, నిర్మించి, దర్శకత్వం, సంగీతం వహించిన యూనివర్సిటీ సినిమా అక్టోబర్ 13న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా నస్పూర్‌కు వచ్చానని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జరిగిన, జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీ ఇతివృత్తంగా యూనివర్సిటీ సినిమా రూపొందించామని చెప్పారు. విద్యారంగంలో పేపర్ లీకేజీ అనేది భారత దేశంలో పెను ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని తెలంగాణ, ఏపీ, గుజరాత్, అసోం, ఎంపీ, బీహార్, యూపీ రాష్ట్రాలలో పేపర్ లీకేజీలు జరిగాయని వివరించారు. విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టాల్సిన బాధ్యత స్వయం ప్రతిపత్తి కలిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై ఉందని తెలిపారు. విద్య జాతీయ సంపద అని దానిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. సినిమా బాగుంటే చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని, దానికి ఉదాహరణ బేబీ సినిమానే అని అన్నారు. జీతం జీవితం రెండూ ఇంగ్లిష్ బాషపైనే ఆధార పడి ఉన్నాయని, నేటి సమాజంలో ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యతను ఈ సినిమాలో బలంగా చూపించామని తెలిపారు. పండుగల సెలవులు, పబ్లిక్ హాలిడేస్‌లో థియేటర్లలో చిన్న సినిమాల ప్రదర్శనకు ఉదయం ఆటను చిన్న సినిమాలకు కేటాయించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరామని తెలిపారు. నా సినిమా ప్రదర్శనకు సహకరించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. తన సినిమాకు ప్రజాయుద్ధనౌక గద్దర్‌తోపాటు తెలంగాణ కళాకారులు పాటలు అందించారని వెల్లడించారు. యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు.

ఎన్నికల బరిలో ఉంటా.. ఆశీర్వదించండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


కన్నీరు పెట్టుకుంటున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నుంచే తాను బరిలో ఉంటానని ఎమ్మెల్యే రేఖానాయక్ స్పష్టం చేశారు. మీ ఆశీస్సులు కావాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. చింతగూడ లక్ష్మీదేవి ఆలయంలో పూజలు చేశారు. అక్కడే ఓ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. రెండుసార్లు ఆశీర్వదించినట్లుగానే వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. 12 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తనకు ఈసారి టికెట్ ఇవ్వలేదని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేను ఓదార్చారు. తర్వాత ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సీపతి రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి జన్నారం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మంజూరైన అభివృద్ధి పనులు నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరిగితే తనకు పేరు వస్తుందని ఆరు నెలలుగా కొంతమంది పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని తెలిపారు. అనంతరం చింతలపల్లి గ్రామానికి వెళ్లి ప్రజలతో కలిసి మాట్లాడారు. అక్కడ గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌కుమార్, కాంతమణి తదితరులు ఉన్నారు.

నృత్యకారులకు సన్మానం..

జిల్లా నృత్య కళాసమాఖ్య ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు గాజుల సహస్రగౌడ్, శ్రేణు, సంకర్ష్, వర్షిణి, తన్విక, అశ్విత, మోక్షితలను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమానికి రేఖానాయక్ హాజరైన మాట్లాడారు. జాతీయస్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి 18 మంది ఎంపిక కాగా, అందులో 8 మంది జన్నారం మండలానికి చెందినవారే కావడం గర్వకారణమన్నారు. చిన్నారుల్లోని కళలను వెలికితీసి, వారి ప్రతిభ జాతీయ స్థాయిలో చూపిస్తున్న మాస్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, డ్యాన్స్ మాస్టర్లు లక్ష్మణ్, రమేశ్, నర్మదగౌడ్, నాయకులు సతీశ్‌కుమార్, కాంతామణి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి


కార్యక్రమంలో వీసీ, డైరెక్టర్, కంపెనీల ప్రతినిధులు

భైంసా: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం వర్సిటీలో కాకతీయ శాండ్‌బాక్స్, దేశ్‌పాండే ఫౌండేషన్, గ్రాడ్ క్యాపిటల్ వ్యవస్థాపకులతో వ్యవస్థాపక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్‌పై 'యువ' ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజురెడ్డి, కాకతీయ శాండ్‌బాక్స్ సీఈవో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల కోసం 'వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ'లో మూడు నెలల నాన్ క్రెడిట్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉన్నట్లుగానే ప్రతీ పనికి ఒక నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు సాంకేతికంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ ఎట్ ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో రాకేశ్‌రెడ్డి కోఆర్డినేటర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ఇంజినీర్స్ డే..

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్, వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మోక్షగుండంవిశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ శాంతి జగదీశ్వరి, అధ్యాపకులు కలీల్, వహీద్, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్సీ'అగ్రి' ప్రవేశాలు షురూ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మంజూరైన బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 11 నుంచి తొలివిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఏడుగురు విద్యార్థులు ఆదిలాబాద్ కళాశాలలో సీట్లు పొందినట్లుగా కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్‌చౌహాన్ తెలిపారు. శనివారంతో తొలివిడత ముగియనుండగా మరికొంత మంది ప్రవేశాలు పొందే అవకాశముందని పేర్కొన్నారు. రాంనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రం భవనాల్లో ప్రారంభించనున్న ఈ కళాశాలకు ప్రభుత్వం 60 సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కాని పక్షంలో రెండు, మూడో విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని డీన్ పేర్కొన్నారు.

అధికారులు వర్సెస్ కార్మికులు

- దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల్లో ఆందోళన
- సీఎంఓఏఐ కోర్టుకెక్కడంతో కార్మిక సంఘాల ఆగ్రహం
- అధికారుల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు
- సమ్మెకు పిలుపునిచ్చిన జాతీయ కార్మిక సంఘాలు


సింగరేణి కార్మికులు

గోదావరిఖని: కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. మా జీతాలు పెరిగితే వాళ్లకేమి కళ్లమంట అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం వర్సెస్ కార్మిక సంఘంగా మారుతోంది. విభేదాలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రోజుల సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 11వ వేతన ఒప్పందం అమలు కావడంతో కోలిండియా వ్యాప్తంగా ఉన్న సింగరేణి, బీసీసీఎల్, ఎస్‌సీఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్, ఎస్ఈసీఎల్, డబ్ల్యూసీఎల్, ఈసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న మూడున్నర లక్షల మందికి పెరిగిన వేతనాలు అమలువుతున్నాయి. ఈసమయంతో అధికారుల సంఘం కోర్టుకెక్కడం కార్మిక సంఘాలకు ఆగ్రహం తెప్పిస్తోంది. తమకు వేతనాలు పెరగాలని పోరాడాలే తప్ప కార్మికుల వేతనాలు ఎందుకు పెరిగాయని వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. అధికారుల వేతన ఒప్పందం పదేళ్లకోసారి, కార్మికుల వేతన ఒప్పందం ఐదేళ్లకోసారి జరుగుతుంది. ఈసమయంలో వేతనాల పెరుగుదల అవకాశం ఉంటుంది. ఈక్రమంలో రెండు నెలల కిందట జరిగిన వేతన ఒప్పందంలో కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ–4 నుండి కింది స్థాయి అధికారులకన్నా కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉండే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అయితే పదేళ్లకోసారి మాత్రమే పెంచేందుకు అవకాశం ఉండటంతో చేసేదేమి లేక కార్మికుల వేతనాలను ఎక్కువగా ఉన్నాయని అధికారులు కోర్టుకెక్కడం హాస్యాస్పదం అంటున్నారు.

వేతనాలపై ప్రభావం చూపితే ఊరుకోం..

తాము యాజమాన్యంతో పోరాడి 11వ, వేతన ఒప్పందం సాధించుకున్నామన్నారు. ఈక్రమంలో అధికారుల సంఘం కోర్టుకెక్కడంతో కార్మికుల వేతనాలు నిలిచిపోతే ఊరుకునేది లేదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. అధికారులు పోరాడి వేతనాలు పెంచుకోవాలే తప్ప కార్మిక వేతనాలపై కోర్టుకెక్కడం సరికాదంటున్నారు. ఈక్రమంలో కార్మికుల వేతనాలపై ప్రభావం చూపితే అధికారులపై తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మె

అధికారుల తీరును నిరసిస్తూ కోలిండియా వ్యాప్తంగా వచ్చేనెల 5,6,7 తేదీల్లో సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు కోలిండియా స్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించాయి. తాము పోరాడి సాధించుకున్న వేతనాలపై ప్రభావం చూపితే అధికారుల అంతుచూస్తామని హెచ్చరిస్తున్నాయి. ఈవిషయంలో అధికారులు పునరాలోచించుకుని ఇన్నేళ్ల పాటు అధికారులు, కార్మికుల మధ్య ఉన్న సత్సంబందాలు కొనసాగించాలంటున్నారు.

ఇక అధికారులపై పోరాటమే..



కార్మికుల వేతనాలపై కోలిండియా అధికారుల సంఘం(సీఎంఓఏఐ) జబల్‌పూర్ హైకోర్టులో పిటిషన్ వేసింది. రెండు నెలలుగా 11వ వేతన ఒప్పందం ప్రకారం కార్మికుల జీతాలు పెరిగాయి. ఈక్రమంలో అధికారులు కోర్టు కెక్కడం వల్ల కార్మికుల పెరిగిన జీతాలు ఆగితే ఊరుకోం. ఇంత ఎంత మాత్రం సమంజసం కాదు.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు

సమ్మెను విజయవంతం చేయాలి



కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇదే వైఖరితో ముందుకు సాగితే ఇరువురి మధ్య అంతరం పెరుగుతుంది. ఇన్నేళ్ల పాటు కొనసాగిన సత్సంబందాలు దెబ్బతింటాయి. అధికారులు వేతనాలు పెంచుకుంటే తమకేమి ఇబ్బంది కాబోదు. పెరిగిన వేతనాలు ఆగితే ఊరుకోబోం.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- భూపాలపల్లిలో అంతర్ రాష్ట్ర పోలీసుల సమావేశం
- దిశా నిర్దేశం చేసిన సీపీ రెమా రాజేశ్వరి


సమావేశంలో సీపీ రెమా రాజేశ్వరి, ఎస్పీలు

గోదావరిఖని: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసు అధికారులు నిర్ణయించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జెన్‌కో కాన్ఫరెన్స్ హాల్‌లో భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షతన వహించిన రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. దీని ద్వారా ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని తెలిపారు. రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయటంతో పాటు మద్యం, డబ్బు ఇతర ఇల్లీగల్‌కు సంబంధించి అక్రమ రవాణా అడ్డుకట్ట పడుతుందన్నారు. సరిహద్దు గుండా అక్రమ మద్యం, మహారాష్ట్ర దేశీదారు, గంజాయి మొదలైన వాటి రవాణా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేశ్‌కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మంచిర్యాల్ డీసీపీ సుధీర్‌కేకన్, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.